క్లుప్తంగా

శుభ్రతతోనే ఆరోగ్యం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు భోజనం చేసే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోష్, వైద్య సిబ్బంది అశోక్ కుమార్, వైష్ణవి, ఉత్తమ్ సింగ్, కావేరి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని మాదపూర్ శివారు గుట్టపై శుక్రవారం భగవాన్‌బాబా, విఠల్‌రుక్మాయి, హన్మాన్, మహాదేవ్ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కమిటీ ఆర్గనైజర్ సెక్రెటరీ గిత్తె సూర్యకాంత్, భక్తులు పాల్గొన్నారు.

శివపార్వతుల పల్లకి ఊరేగింపు


పల్లకిని ఊరేగిస్తున్న శివ దీక్షాదారులు

తాంసి: మండలంలోని గిరిగాంలో శుక్రవారం శివదీక్షదారులు శివపార్వతుల పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా పువ్వులతో అలంకరించిన పల్లకిలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి పల్లకిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు భూమేశ్, పొచ్చన్న, అనిల్, రాంబాయి, రాధ, నవీన్ పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్


ఇసుక డంప్ సీజ్ చేస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణపై రెవెన్యూ అధికారులు కొరఢ ఝులిపిస్తున్నారు. భోరజ్ మండలంలోని పెండల్వాడ, డొలరా గ్రామాల్లో సాగుతున్న అక్రమ దందాను శుక్రవారం తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్గాల విలాస్ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పెన్‌గంగా నదిలోకి వెళ్లి మరీ ఇసుక తవ్వకాలను పరిశీలించారు. అక్రమంగా నిల్వ చేసిన పలు డంపులను సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.
బేల: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ రావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కాంఘర్‌పూర్, మాంగ్రుడ్ రెవెన్యూ గ్రామాల శివారులోని పెన్‌గంగ ఇసుక క్వారీలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై దివ్యభారతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాజీద్, జూనియర్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

'అణగారిన వర్గాల గొంతుకను గెలిపించండి'


మాట్లాడుతున్న మంద జ్యోతి

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అణగారిన వర్గాల బిడ్డగా గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రజాస్వామికంగా పీడిత బాధ్యత వర్గాలకు న్యాయం జరగాలంటే అణగారిన వర్గాల ప్రాతినిథ్యం కావాలన్నారు. సమావేశంలో అన్నెల లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, అన్నెల అడెల్లు, దర్శనాల సుష్మ, గోపి, కొండమడుగు గణేష్, అగ్గిమల్ల నవీన్ పాల్గొన్నారు.

ముహూర్తం ఎప్పుడో?

- సిరికొండకు పీహెచ్‌సీ మంజూరు
- ప్రారంభం కాని నిర్మాణ పనులు
- అందుబాటులోకి తీసుకువస్తే గిరిజనులకు మేలు


పీహెచ్‌సీ కోసం స్థలం సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

సిరికొండ: దేవుడు కరుణించిన పూజరి వరమివ్వట్లేదు అన్న చందంగా మారింది మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణం. నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలం పూర్తిగా గిరిజన ప్రజలతో కూడిన ప్రాంతం. ఇక్కడ ప్రజలకు ఆపదొస్తే.. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే గాల్లో దీపం పెట్టి దేవుడా.. నీవే దిక్కు అనాల్సిన పరిస్థితి. ఈ గోడును ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటే.. స్పందించి ప్రభుత్వం మండలానికి పీహెచ్‌సీ మంజూరు చేసింది. దీంతో మండల ప్రజల ఆశలు నెరవేరినట్లు అయింది.

ప్రారంభం పనులు..

మండలానికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రూ.1.43 కోట్ల నిధులతో మంజూరు చేసి ఏడాది గడిచినా.. పనులు మాత్రం ముహూర్తం రావడం లేదు. మండల కేంద్రంలో పంచాయతీ ద్వారా స్థల సేకరణ కూడా అయి సదరు కాంట్రాక్టరు పనులను ప్రారంభించపోవడంతో ప్రజలు ఇప్పటికీ ఆసుపత్రి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు.

అనేక ప్రాణాలు గాల్లో..

మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలకు అత్యవసర సమయంలో ఆసుపత్రికి చేరాలంటే గుంతల రోడ్లను దాటుకొని ఇంద్రవెల్లి మండలంలోని పీహెచ్‌సీకి లేదా ఇచ్చోడ పీహెచ్‌కి, ఇచ్చోడ మండలంలో ఉన్న నర్సపూర్‌కు 50 కిలోమీటర్లు ప్రయాణించి చికిత్స అందించాలి. ఇన్ని ఇబ్బందులు, కష్టాలు పడి సరైన సమయంలో ఆసుపత్రికి చేరుకోలేక అనేక ప్రాణాలు గాల్లో కలిసిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పీహెచ్‌సీ భవన నిర్మాణపు పనులు ఆలస్యం చేయకుండా వెంటనే నిర్మాణపు పనులు చేపట్టి, మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



సిరికొండకు మంజూరైన పీహెచ్‌సీ భవనం పనులు త్వరగా ప్రారంభించాలి. భవనం పూర్తి చేసి, ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజల ఆరోగ్య కష్టాలను దూరం చేయాలి.
– పెందూర్ అమృత్‌రావు, సార్‌మేడి, రిమ్మ

ఆలస్యం చేయవద్దు



అధిక సంఖ్యలో పేద గిరిజనులు ఉన్న మండలానికి పీహెచ్‌సీ మంజూరు కావడం సంతోషం. ప్రభుత్వ వైద్యం కోసం కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఎన్నో రోజులకు మాకష్టాలు దూరం అవడానికి పీహెచ్‌సీ మంజూరైంది. ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలి.
– భగవంత్‌రావు, లక్ష్మీపూర్

త్వరలో పనులు ప్రారంభం

సిరికొండ మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణపు పనులు రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం. త్వరగా పనులు పూర్తి చేసి ఆసుపత్రిని మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.
–రాజేశ్, పంచాయతీరాజ్ డీఈ

జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

- చికెన్ దుకాణాల మూసివేత


రైల్వే స్టేషన్ ఎదుట మూసి ఉన్న చికెన్ దుకాణాలు

కైలాస్‌నగర్: జిల్లా ప్రజలను బర్డ్‌ఫ్లూ భయాందోళనకు గురిచేస్తుంది. ఈ వ్యాధి కోళ్ల ద్వారా వ్యాపిస్తుందనే ప్రచారంతో జనం చికెన్‌ను తినేందుకు వెనుకాడుతున్నారు. దీంతో జిల్లాకు రావాల్సిన కోళ్ల వాహనాలను రాకుండా అధికారులు అడ్డుకుని తిరిగి వెనక్కి పంపించేస్తున్నారు. ఫలితంగా చికెన్ కొనుగోళ్లు తగ్గిపోవడంతో మార్చి 1వరకు జిల్లా వ్యాప్తంగా చికెన్ దుకాణాలను మూసివేయాలని వ్యాపారులు నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్, ఇచ్చోడ, బోథ్ వంటి ప్రధాన మండలాల్లోనూ చికెన్ దుకాణాలన్ని మూతపడ్డాయి. ఇలా ఉంటే మాంస ప్రియులు ప్రత్యామ్నయంగా మటన్, చేపలపై దృష్టి సారించారు. దీంతో వాటికి తీవ్ర డిమాండ్ ఏర్పడింది. కొన్ని చోట్ల వ్యాపారులు మటన్ రేట్లను పెంచి విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నార్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట కేశవులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలపై అవగాహన కల్పించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, ఉదయ్ కుమార్, నరేశ్, వెంకట రమణ, సుజాత పాల్గొన్నారు.
నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు శుక్రవారం ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సౌకర్యాలు, సైన్స్ ల్యాబ్, కళాశాల స్థితిగతుల గురించి వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే అడ్మిషన్లు పొందాలన్నారు. అంతకు ముందు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు కొండ గోవర్ధన్, పి.భీంరావు, దత్తు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్నివర్గాలకు అన్యాయం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేణుగోపాలాచారి

కై లాస్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సేవాభవన్‌లో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వీ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్‌లను కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని ఆదరించి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, కొండూరి రవి, సామ రూపేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- కేసు నమోదు
- విచారణ చేపట్టిన పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌లోని ఓ కాలనీకి చెందిన బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల క్రితం ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను రిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. రిమ్స్‌లో బాలికను, కుటుంబ సభ్యులను ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ జానకి షర్మిల పరామర్శించారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

నార్నూర్: కాంగ్రెస్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నరేందర్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు శాతం పెరిగేలా చూడాలన్నారు. ఓటర్ జాబితా ప్రతీ గ్రామం వారీగా విడివిడిగా తీసుకొని ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో కుమురం భీం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, లోకండే దేవరావు, కైలాస్ నాయక్, కాంతారావు దుర్గే, నజీర్, కొర్రెల్ల మహేందర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల చూపు కాంగ్రెస్ వైపు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

బోథ్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిశీలకులు గండ్ర సత్యనారాయణ అన్నారు. బోథ్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ.. బీజేపీ వల్ల రాష్ట్రానికి, ఆదిలాబాద్ జిల్లాకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, సత్తు మల్లేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బొడ్డు గంగారెడ్డి, సత్యవతి కోటేష్, గోక గణేష్ రెడ్డి, నరసయ్య, బాబన్న, కళ్యాణ రాజేశ్వర్, నారాయణ సింగ్, ఆడే షీలా, రాజు యాదవ్ పాల్గొన్నారు.

శాంతినగర్‌కు బీఆర్ఎల్ఎఫ్ అవార్డు


అవార్డు అందుకున్న శాంతిగనర్ గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) పంచాయతీ పరిధిలోని శాంతినగర్ గిరిజన గ్రామానికి శుక్రవారం ఢిల్లీలో బీఆర్ఎల్ఎఫ్ సంస్థ తరపున ఉత్తమ అవార్డు ప్రదానం చేశారు. జిల్లాలో అటవీ హక్కులు, అటవీ వనరులు సద్వినియోగం, అటవీ సంరక్షణలో భాగంగా శాంతినగర్ అవార్డుకు ఎంపికైంది. సముదాయక అటవీ హక్కుల చట్టంలో భాగంగా బీఆర్ఎల్ఎఫ్ సంస్థ తరపున జిల్లాలో 80 దరఖాస్తులు చేయగా శాంతినగర్ శివారులో వనరులు గుర్తించడం, హద్దుల ఏర్పాటు, అటవీ హక్కులు, మొక్కల పెంపకంతో శాంతినగర్ అవార్డుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా శుక్రవారం ఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమన్వయ్ నేషనల్ లైవ్‌లీ హూడ్స్ సమ్మిట్‌లో భాగంగా అవార్డును బీఆర్ఎల్ఎఫ్ సంస్థ సీఈవో చేతుల మీదుగా అందించారు. శాంతినగర్ సీసీడీ ప్రాజెక్టు మేనేజర్ కుమ్ర విఠల్‌రావు, సీఎఫ్ఆర్ జిల్లా కోఆర్డినేటర్ మహేందర్, కొలాం జిల్లా జనరల్ సెక్రటరీ టేకం దిలీప్, గోమ అవార్డును అందుకున్నారు.

మాతృభాష మూలాలు మరిచిపోవద్దు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రఘు గణపతి

ఆదిలాబాద్: మాతృభాష మూలాలు మర్చిపోకూడదని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రఘు గణపతి అన్నారు. పట్టణంలోని కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తమ యొక్క మాతృభాషలో మాట్లాడాలని సూచించారు. మాతృభాష పరిరక్షణకు ప్రాచీన గ్రంధాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. రేఖా, అనిత, పూనం, సమీర్, నరేశ్, సంతోషిని, భువన, విద్యార్థులు పాల్గొన్నారు.
ఆదిలాబాద్: మాతృభాష సంరక్షణతోనే సంస్కృతి పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. భాషా వైవిధ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, భాషా ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, డీఎస్ చక్రవర్తి, గోలి సంజీవ్, నందకుమార్, రాధా, సుమయ్య సుల్తానా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ కాంటేకర్ కోరారు. శుక్రవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో పార్టీ అభ్యర్థిని మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ కన్వీనర్ స్వామి, మండల అధ్యక్షుడు చంద్రకిరణ్, సదానంద్, నారాయణ, పోచ్చన్న పాల్గొన్నారు.
బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానంద్ బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోరె రవీందర్, మహిపాల్, షేక్, జుగాది రావు, జక్కుల వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, రంజిత్, హరీశ్ పాల్గొన్నారు.
నేరడిగొండ: బీజేపీ బలపర్చిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆకుల రాజశేఖర్, గట్టు నారాయణ, రాములు, రాజు, తీగల నవీన్, బంటు ప్రవీణ్, రంజిత్, శ్రీధర్ రెడ్డి, పుండరి రమేష్, సాయి, కోటేష్ పాల్గొన్నారు.

శ్రామిక మహిళా దినోత్సవం విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని మావల మండలంలో కుమురం భీం గూడలో మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ మహిళ సంఘం తుడుందెబ్బ జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. స్త్రీ ఆధునిక యుగంలో కూడా వివక్షతకు గురవుతునే ఉందన్నారు. సమావేశంలో నాయకులు ఉయిక ఇందిర, సోయం లలిత, సోయం సుమన్‌బాయి, వెడమ మానుకుబాయి, సిడాం రూపాబాయి, చాహకటి అనసూయ, కళాబాయి పాల్గొన్నారు.

ప్రయాగ్‌రాజ్ భక్తులకు టిఫిన్ పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద శుక్రవారం మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రయాణికులకు ఉచితంగా టిఫిన్ పంపిణీ చేశారు. కుంభమేళా సందర్భంగా మండల కేంద్రం మీదుగా ప్రతీ రోజు వేల వాహనాలు ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్తున్నాయి. టిఫిన్‌తో పాటు చల్లని నీటిని అందచేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ పౌరుల బాధ్యత


మాట్లాడుతున్న అసోసియేట్ ప్రొఫెసర్

ఆదిలాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతీ పౌరుని బాధ్యత అని ప్రభుత్వ పాలనశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగితేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందన్నారు. ప్రజాస్వామ్యం నిలబడాలంటే పౌరులు ఎల్లప్పుడూ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రఘు గణపతి, అధ్యాపకులు గోపాల్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం..

సన్మానం

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొడ్డు గంగారెడ్డి మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శాలువాతో సత్కరించారు. కారక్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు నరసింహ దాస్, కురుమే మహేందర్, మెరుగు భోజన్న, ఆబూద్, ఆసిఫ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పనుల్లో వేగం పెంచే విధంగా క్షేత్రస్థాయి పర్యవేక్షకులు కృషి చేయాలన్నారు, ప్రతీ కూలీ వంద రోజుల పాటు పనులు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

టై, బెల్టులు పంపిణీ

నేరడిగొండ: మండలంలోని తర్నం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మాయ, ఉపాధ్యాయులు సృష్టి, విద్య కమిటీ చైర్మన్ స్రవంతి, విద్య కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్‌లు శుక్రవారం టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో కాంటికే నవీన్, తీన్మార్ మల్లన్న టీం మండల కన్వీనర్ జూల సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావు బాబా సప్తాహం

బేల: మండలంలోని కోగ్దూర్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ వేడుకలు శుక్రవారం ముగిశాయి. స్థానిక ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో, చిన్నారులను దేవతల రూపంలో అలకరించి పల్లకి ఊరేగించారు. బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు బోధించారు. చివరగా కాలదహీ హండీ నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న కంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల దక్షిణముఖ హనుమాన్ ఆలయ 38వ వార్షికోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆయన వెంట నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి , మునిగెల విఠల్, రాంరెడ్డి కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

'సోషలిస్టు వ్యవస్థనే ప్రత్యామ్నాయం'

కైలాస్‌నగర్: పెట్టుబడి దారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రెడ్ బుక్ డే నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ రాజకీయ ముసాయిదాను సామూహిక పఠనం చేశారు. కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, మంజుల, సురేందర్, జమున, స్వామి, చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ సతీశ్

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ , చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఫోక్సో చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీశ్ మాట్లాడుతూ.. పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. భారతదేశాన్ని బాల్య వివాహ ముక్త భారత్‌గా మార్చాలని, అందరూ చదువుపై శ్రద్ధ చూపి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, అశ్విని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.